కాశ్మీర్‌లో నిర్బంధం తగ్గనిదే 'కాశ్మీర్' సమస్యకు రాజకీయ పరిష్కారం సాధ్యమా?

- బాలగోపాల్

'కాశ్మీర్ సమస్య కాశ్మీరీల మనోభీష్టాన్ని అనుసరించి పరిష్కారం కావాలి' అని పాకిస్తాన్ అంటుంది. ఈ అభిప్రాయాన్ని కాదనడం భారత్‌కు సాధ్యం కాదు కాబట్టి ఇష్టమున్నా లేకున్నా అవుననంటుంది. అయితే ఆ మనోభీష్టం 1956లో జమ్ముకాశ్మీర్ రాష్ట్ర రాజ్యాంగం రాసినప్పుడే వ్యక్తమయిందనీ ఆ తరువాత ఒక్కొక్కసారి ఎన్నికలలో వోట్లు వేసినప్పుడు మళ్ళీ పునర్వ్యక్తమయిందనీ ఇప్పుడింక వ్యక్తం కావలసిందేమీ లేదనీ అంటుంది. అందువల్ల నిజానికి 'కాశ్మీర్ సమస్య' అనేదేదీ లేదనీ 'సీమాంతర ఉగ్రవాదం' సమస్య మాత్రమే ఉందనీ కూడా అంటుంది.

నిజానికి ఆనాడయినా ఈనాడయినా కాశ్మీరీల మనోభీష్టం వ్యక్తమయ్యే పరిస్థితి అక్కడ లేదు. 1953లో షేక్ అబ్దుల్లాను మన పాలకులు మొదటిసారి అరెస్టు చేసినప్పటి నుండీ 'కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే'నన్న అభిప్రాయానికి తప్ప వేరే అభిప్రాయానికి కాశ్మీర్‌లో స్వేచ్ఛ లేదు. షేక్ అబ్దుల్లాను అతనితో ఏకీభవించే వారినీ జైలులో పెట్టి 1956లో బక్షీగులాం మహమ్మద్ నాయకత్వంలోని కాశ్మీర్ రాజ్యాంగ సభ చేత 'జమ్ముకాశ్మీర్ రాష్ట్రం ఇండియాలో విడదీయరాని భాగం' అని భారతపాలకులు రాయించారు. షేక్ అబ్దుల్లా ఆ అభిప్రాయానికి తల ఒగ్గేదాకా అతనికి స్వేచ్ఛ ఇవ్వలేదు. ఆ అభిప్రాయానికి తలవొగ్గని వారికి కాశ్మీర్‌లో ఎన్నికలలో పోటీచేసే అవకాశమెప్పుడూ ఉండలేదు. 'ఆజాద్ కాశ్మీర్'కూ, 'ఇండియాలో విడదీయరాని భాగమైన కాశ్మీర్'కూ తేడా ఏమిటంటే కాశ్మీర్ పాకిస్తాన్‌లో విడదీయరాని భాగం అని ఒప్పుకునే వారికి మాత్రమే ఆజాద్ కాశ్మీర్‌లో ఎన్నికలలో పోటీ చేసే హక్కు ఉందని వారి రాజ్యాంగమే అంటుంది. మన వాళ్ళు రాజ్యాంగంలో అట్లా రాయలేదు గానీ కాశ్మీర్ ఇండియాలో శాశ్వతంగా అంతర్భాగమని ఒప్పుకోని వారి నామినేషన్లు ఏదో ఒక సాకు చూపించి తిరస్కరించడం కాశ్మీర్‌లో మొదటి ఎన్నిక నుండి 1987లో జరిగిన చివరి ఎన్నికల దాకా నడిచిన ప్రహసనమే.

కాబట్టి ఒకప్పుడు కాశ్మీరీలు తమ మనోభీష్టాన్ని వ్యక్తం చేసారనడానికి ఆస్కారం లేదు.

ఇప్పుడు వారి అభీష్టాన్ని వారు వ్యక్తం చేయాలని అనుకున్నా దానికి అనుకూలమైన పరిస్థితి అసలే లేదు. కాశ్మీర్ ఒక బహిరంగ జైలు అంటే అతిశయోక్తి కాదు. కాశ్మీర్‌లో నలుమూలలా సైన్యం ఉంది. కంటోన్మెంట్లలో మాత్రమే కాదు, గ్రామాలలో ఆపిల్ తోటలలోనూ, డ్రైఫ్రూట్స్ తోటలలోనూ సైన్యం క్యాంపులు నెలకొల్పింది. వాళ్ళ కన్నుగప్పి బతకడం కాశ్మీరీలకు ఒక్క క్షణం కూడా సాధ్యం కాదు. ఆ కన్ను చూసి ఊరుకోదు, చూస్తూ ఊరుకోదు. కాశ్మీర్‌లో సైన్యం ప్రతి క్షణం కదులుతూ ఉంటుంది. పెట్రోలింగ్ చేస్తూ ఉంటుంది. సైన్యం ట్రక్కులు విపరీతమైన వేగంతో ప్రధానరహదార్ల మీద తిరుగుతుంటాయి. గ్రామీణ రహదార్ల మీద ఆటోమేటిక్ తుపాకులు పట్టుకున్న జవాన్లు కాలినడకన గుంపులుగా తిరుగుతుంటారు.

ఏ రోజయినా ఏ గ్రామంలోనైనా సోదా జరగవచ్చు. సోదాకు వచ్చే సైనికులు చిన్న సంఖ్యలో ఎప్పుడూ రారు. పెద్దసంఖ్యలో వచ్చి గ్రామాన్ని చుట్టుముడతారు. మగవాళ్ళందరినీ ఇళ్ళ నుండి బయటకు రమ్మంటారు. మొదట్లో మగవాళ్ళు బయటికొచ్చి స్త్రీలు ఇళ్ళలో ఉండేవారు. అప్పుడు సైనికులు ఇళ్ళ లోకి ప్రవేశించి మిలిటెంట్ల కోసం, ఆయుధాలకోసం, పేలుడు పదార్థాల కోసం సోదా చేసే క్రమంలో స్త్రీలను బలాత్కారం చేయడం, అవమానపరచడం తరచుగా జరిగేది. అందువల్ల ఇప్పుడు మగవాళ్ళను బయటికి రమ్మంటే వారితో పాటు స్త్రీలు కూడా బయటికొచ్చేస్తున్నారు. బయటకురావడం అంటే ఊరికే ఇంటిబయట నిలబడడం కాదు. అందరూ ఒకచోట గుమిగూడి దొడ్డికి కూర్చున్నట్టు కూచొని తల మోకాళ్ళమధ్య పెట్టుకొని కళ్ళు దించుకొని సోదా ముగింపు కోసం నిరీక్షించాలి.

ఏదైనా ఇంట్లో మిలిటెంట్లున్నారని తెలిస్తే ఇంక వారిని చంపడం కోసం, సైన్యం ఆ యింటిని తగలబెట్టడానికైనా, పేల్చివేయడానికైనా వెనుకాడదు. ఆ విధంగా కాలిపోయిన, పేలిపోయిన ఇళ్ళు కాశ్మీర్‌లో ఎటుపోయినా కనిపిస్తాయి.

సోదా చేసే క్రమంలో ఎవరిమీదైనా అనుమానం వస్తే సైన్యం వారిని అదుపులోకి తీసుకొని తన క్యాంపుకు తీసుకుపోతుంది. పోలీసు లాకప్పులు మాత్రమే తెలిసిన వారికి సైనిక క్యాంపులోని పరిస్థితి ఊహకు అందడం కూడా కష్టం. నాలుగైదు రోజుల అక్రమ నిర్బంధం పోలీసు కస్టడీలో ఎంత మామూలు విషయమో, నాలుగైదు వారాల నిర్బంధం సైన్యం క్యాంపులలో అంత మామూలు విషయం. అక్కడినుండి శవాలుగా మారి 'ఎన్‌కౌంటర్' మృతులుగా బయటికొచ్చేవారు కొందరైతే, అసలే కనబడకుండా పోయేవారు చాలామంది ఉన్నారు. 9 సంవత్సరాల పసిబాలుర నుండి 70 సంవత్సరాల వృద్ధుల దాకా మొత్తం 4000 మంది సైన్యం కస్టడీ నుండి 'అదృశ్యం' అయ్యారని అసోసియేషన్ ఆఫ్ పేరెంట్స్ ఆఫ్ డిసపియర్డ్ పర్సన్స్ (ఎపిడిపి) అధ్యక్షురాలు పర్వీనా అహంగర్ అంటారు. అందులో 500 మంది గురించి ఆమె దగ్గర పూర్తి వివరాలు ఉన్నాయి.

చిత్రహింసల మోతాదు కూడా పోలీసు లాకప్పులతో పోలిస్తే అక్కడ చాలా ఎక్కువ. పోలీసులు ప్రయోగించే అణచివేత దేశభక్తితో ముడిపడిన 'ధర్మం' కాదు. శాంతిభద్రతలతో ముడిపడినది మాత్రమే. అందువల్ల పోలీసులు ప్రయోగించే హింసను సమర్థించేవాళ్ళూ ఉంటారు, వ్యతిరేకించేవాళ్ళూ ఉంటారు. సైన్యం చర్యలను ఆవరించి నంత బలంగా పోలీసుల చర్యలను భావజాలం ఆవరించి ఉండదు.

పైగా, కాశ్మీర్‌లో సైన్యానికిచ్చే తర్ఫీదు వారిలో క్రూరత్వాన్ని పెంచే స్వభావం గలది. కాశ్మీరీలందరూ దేశద్రోహులు, పాకిస్తాన్ ఏజెంట్లు, ముస్లిం మతోన్మాదులు అనేది వారికిచ్చే తర్ఫీదు. దానితో వారు మరింత క్రూరంగా ప్రవర్తిస్తారు. 'నీ కొడుకు మిలిటెంటా? అయితే నువ్విక్కడ ఎందుకున్నావు? పాకిస్తాన్‌కు పో' అని మిలిటెంట్ల తల్లిదండ్రులను తిడుతుంటారు. వాళ్ళు పాకిస్తాన్‌కు ఎందుకు పోవాలి? వాళ్ళ కొడుకు మిలిటెంటయింది పాకిస్తాన్ కోసం కాదు. కాశ్మీర్ కోసం. కాశ్మీర్‌లో ఉండకుండా వాళ్ళు పాకిస్తాన్‌కు ఎందుకు పోవాలి? ఈ మాత్రం ఆలోచన సైన్యానికి రావడం లేదంటే వారికిచ్చే ట్రైనింగ్ అట్లాంటిది.

ఆ ప్రజలంటే సైన్యానికి ఏమాత్రం సానుభూతి లేకపోవడం వల్ల వాళ్ళ పట్ల మరింత క్రూరంగా ఉండగలుగుతుంది. మిలటెంట్లు ఒక పేలుడు పదార్థాన్ని ఆర్మీక్యాంపు సమీపంలో వదిలిపెట్టి పోతే, దానిని తన సైనిక నిపుణుల చేత 'డిఫ్యూజ్' చేయించే బదులు స్థానిక ప్రజలను పిలిచి వారిచేత దానిని తీసేయించే ప్రయత్నం చేయడం, అది పేలి వారు చావడం కాశ్మీర్‌లో చాలాసార్లు జరిగింది.

ఈ రకమైన వాతావరణంలో, కాశ్మీరీల అభీష్టం ప్రకారమే 'కాశ్మీర్ సమస్య' పరిష్కారం కావాలి కాని ఒకవేళ భారత్ ఒప్పుకున్నా ఆ అభీష్టం ఒకరూపం తీసుకునేదెట్లా? నిర్భయంగా ప్రజలు చర్చించుకునే వాతావరణం, సంవాదం పెట్టుకునే వాతావరణం లేనప్పుడు 'ప్రజాభీష్టం' ఏమిటో ఎవరు చెప్పగలరు? కాశ్మీర్ పాకిస్తాన్‌లో కలవాలని నమ్మేవాళ్ళూ ఉన్నారు. స్వతంత్రంగా ఉండాలని నమ్మేవాళ్ళూ ఉన్నారు. ఇండియాలోనే ఉండిపోవాలనే వాళ్ళూ ఉన్నారు. ఒకప్పటి జమ్ము కాశ్మీర్ రాష్ట్రమంతా ఒకటిగా ఉండాలని కోరుకునే వాళ్ళున్నారు. ఇటు కాశ్మీర్‌లోయ, అటు ఆజాద్ కాశ్మీర్‌లోని ముజఫరాబాద్ డివిజన్ కలిసి ఒకటిగా ఉన్నట్టయితే తక్కిన భూభాగం ఏమయినా ఫరవాలేదనుకునే వారున్నారు. కేవలం భారత్‌లోని కాశ్మీర్‌లోయ గురించి ఆలోచించే వారున్నారు. కాశ్మీర్ అనే భావనలో కాశ్మీరీ హిందువులూ సిక్కులూ కూడా భాగమేనని నమ్మేవారున్నారు. ఆ పట్టింపు లేని వారున్నారు. ఇన్నిరకాల దృష్టికోణాలునప్పుడు వాటిమధ్య చర్చ, సంవాదం జరిగే అవకాశం లేనట్లయితే 'ప్రజాభీష్టం' అనేదొక రూపం తీసుకునే అవకాశం ఉంటుందా?

అందుకే గత సంవత్సరం నవంబర్ నెలలో భారత్ ప్రకటించిన కాల్పుల విరమణపట్ల కాశ్మీరీలు హర్షం వ్యక్తం చేసారు. మిలిటెంట్ సంస్థలలో ముఖ్యమైనదయిన లష్కర్-ఇ-తోయిబా కాల్పుల విరమణను వెంటనేతిరస్కరించింది గానీ సగటు కాశ్మీరీలు 'ఆజాదీ' కోరుకునేవారు కూడా దానిని ఆహ్వానించారు. లష్కర్ తిరస్కరణ వల్ల భారతప్రభుత్వంలోని సంఘపరివార్ తీవ్రవాదులకు కాల్పుల విరమణను వెనక్కి తీసుకునే అవకాశం కల్పించిందని బాధపడే వారు చాలామంది కాశ్మీర్‌లో ఉన్నారు.

లష్కర్ ఏ పరిస్థితిలోనైనా తిరస్కరించేదేనేమో - ఎందుకంటే వారి అజెండా కాశ్మీరీ జాతీయవాద అజెండా కాదు, ఇస్లామిక్ 'జిహాదీ' అజెండా. అయితే నవంబర్ నాటి కాల్పుల విరమణను తిరస్కరించడానికి కాశ్మీరీ జాతీయవాదులకు సహితం సహేతుకమయిన కారణం ఒకటి లేకపోలేదు. కాల్పుల విరమణ ఒక రాజకీయ పరిష్కారంలో అంతర్భాగమయినట్టయితే దానికి అర్థం ఉంటుంది గానీ రాజకీయ పరిష్కారంతో నిమిత్తం లేని కాల్పుల విరమణతో కాశ్మీరీలు సహకరించడమంటే తమ పోరాటాన్ని వదులుకొని కాశ్మీర్‌పైన భారత్ తన పాలనాధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి అవకాశం ఇవ్వడమే అవుతుంది. అది కాశ్మీరీలెవ్వరికీ ఇష్టంలేదు.

అందువల్లనే లష్కర్-ఇ-తోయిబా వైఖరి పట్ల కాశ్మీరీలలో కొంత అసంతృప్తి ఉన్నా, తప్పు ప్రధానంగా భారత్‌దేనని వాళ్ళు సహేతుకంగానే భావిస్తారు. భారత్ ఇప్పటిదాకా కాశ్మీర్ ఒక 'వివాదం' అని ఒప్పుకోదు. ఆ వివాదం పరిష్కారం కాశ్మీరీల అభీష్టం ప్రకారం జరగాలని ఒప్పుకోదు. ఆ అభీష్టం ఇప్పటిదాకా స్వేచ్ఛగా వ్యక్తం కాలేదని ఒప్పుకోదు. ఇవన్నీ ఒప్పుకోకుండా 'నేనూ కాల్పులు విరమిస్తాను, మీరూ విరమించండి' అంటే అర్థం ఏమిటి? శాంతి నెలకొల్పి భారత్ పాలనాధికారాన్ని కాశ్మీర్‌పైన స్థిరపరచుకోవడమే దాని లక్ష్యమని కాశ్మీరీలు ఎందుకు అనుమానించకూడదు?

అందువల్ల కాశ్మీర్ వివాదాన్ని భారత్ ఒక చారిత్రక వివాదంగా గుర్తించాలి. అది ప్రజల అభీష్టం ప్రకారం పరిష్కారం కావాలని గుర్తించాలి. ఆ అభీష్టం ఇప్పటిదాకా వ్యక్తమయిందని అనడం అబద్ధమని ఒప్పుకోవాలి. ఇప్పుడు ఈ గుర్తింపు ప్రాతిపదిక పైన నిజమైన రాజకీయ పరిష్కారం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టి అందులో అంతర్భాగంగా శాంతి నెలకొల్పే కృషి చేయాలి. ఆ రకమైన కాల్పుల విరమణకు కాశ్మీరీలు స్పందించడమే కాక లష్కర్-ఇ-తోయిబా వంటి సంస్థల పైన ఒత్తిడి తెచ్చి వారి సహకారం పొందడానికి ప్రయత్నం కూడా చేస్తారు. ఎందుకంటే అది అందరికంటే ఎక్కువగా వారి అవసరమే కాబట్టి. ❖

హైదరాబాద్ ఎపిసిఆర్ఎఫ్ కమిటీ సర్వసభ్య సమావేశం

ఆగస్టు 5న ఎపిసిఆర్ఎఫ్ హైదరాబాద్ కమిటీ సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం సంస్థ నిబంధనావళి - కార్యక్రమాన్ని చర్చించింది. సమావేశం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. అధ్యక్షులుగా శరత్, కార్యదర్శిగా రాము, కోశాధికారిగా శైలజ, కార్యవర్గ సభ్యులుగా చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, రాములు, ఫరూక్ ఎన్నికయ్యారు.